మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

విద్యుత్ ఉద్యోగుల దశలవారీ ఆందోళన

- స్పందించకుంటే నిరవదిక సమ్మె - జెఎసి తీర్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలనుపరిష్కరించాలని దశలవారీ ఆందోళన చేస్తామని, స్పందించక పోతే నిరవదిక సమ్మె చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకులు హెచ్చరించారు. అవుట్‌సోర్సింగు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జెఎసి నాయకులు ఎఇ అసోసియేషన్ నాయకులు అంకం మహేశ్వరరావు, ఇంజనీరింగ్ సెక్షన్ నాయకులు గంగన్న, 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, రంగస్వామి, శివకుమార్, విరూపాక్షి రెడ్డి హుస్సేన్, ప్రసాద్, రామరాజు, వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా రెండవ రోజు మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఉద్యోగస్తులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి జెఎసి అధ్యక్షులు డిఎన్. గణేష్ అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. నేరుగా జీతాలు ఇవ్వాలని ,సమాన పనులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019 ఫిబ్రవరి ఒకటి నుంచి 2024 ఆగస్టు 8 మధ్య నియామకమైన ఉద్యోగులకు ఇపిఎఫ్ నుండి జిపిఎఫ్ ను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలు చేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను క్రమబద్ధీకరించియాలన్నారు. పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని కోరారు. ఏకసభ్య కమిషన్ రద్దుచేసి పిఆర్‌సి 2022 ను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్‌పిలు, పిపిలు లేకుండా అందరికీ ఒకే మాస్టర్ స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో వెంటనే కొత్త పోస్టులు మంజూరు చేయాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ డిస్కౌంట్ లో ఉద్యోగులకు కొత్త సేవ నిబంధనలను రూపొందించడం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి సమావేశం నిర్వహించి ఈనెల 31న స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించాలని, ఆగస్టు ఒకటిన సర్కిల్ ఆఫీస్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు మాస్ ర్యాలీ నిర్వహించాలన్నారు. రెండు మూడు తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని 4, 5, 7 తేదీల్లో వర్క్ టు రూల్ నిర్వహించాలన్నారు. 8న మహాధర్నా విద్యుత్ సౌదా, విజయవాడలో నిర్వహించాలని, ఆగస్టు 9న డిపార్టుమెంట్ సిమ్స్ హ్యాండింగ్ ఓవర్ చేయాలని, అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే ఆగస్టు 10న నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యుత్ ఉద్యోగి పాల్గొని జయప్రదం చేసి తమ డిమాండ్లను సాధించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఐక్యతే మహాబలం విద్యుత్ ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, విద్యుత్ ఉద్యోగుల జెఎసి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ఎపి ఎస్‌పిడిసిఎల్, ఎపి ట్రాన్స్‌కో ఉద్యోగులు, మహిళా, ఉద్యోగులు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

రాయలసీమ యువత ఆశయాలను నీరుగార్చిన బిజెపి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-ఆలూరు

రాయలసీమ ప్రాంత ప్రజల హక్కు అయిన కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని బిజెపి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాతపూర్వకంగా ఎపి ఎంపీలకు చెప్పడం చూస్తే రాయలసీమ యువత ఆశయాలను నీరుగార్చడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి విమర్శించారు. శుక్రవారం ఆలూరు జ్యోతిబసు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజనలో ప్రత్యేక హోదా పదేళ్లతో పాటు వెనుకబడిన రాయలసీమ జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమ, అనంతపురం, కర్నూలు, చిత్తూరులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని బిజెపి హామీఇచ్చిందని తెలిపారు. పదేళ్లయినా బిజెపి రాష్ట్ర ప్రజలను మోసం చేసి ఎలాంటి హామీలూ నెరవేర్చలేదన్నారు. నాడు టిడిపి ప్రభుత్వం కడప ఉక్కు కోసం ఆమరణ దీక్ష చేసి నేడు మౌనంగా ఉండడం ఏమిటని నిలదీశారు. అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి 25 ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని ప్రగల్భాలు పలికారని, నేడు కేంద్రం ముందు నడుములు వంచి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి జనసేన భజన చేస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు మేలుకొని రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన నిజస్వరూపాన్ని కనిబెట్టాలని కోరారు. హక్కులను పోరాడి సాధించుకోవాలని తెలిపారు. ఈనెల 31న రాయలసీమ జిల్లాల కలెక్టరేట్ల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో యువత, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నాయకులు హనుమంతు, శేఖర్, కెపి.నారాయణ స్వామి, షాకీర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

- డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జొహరాపురం పరిధి తప్పెట గేరి సచివాలయంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐఒ మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గృహ సందర్శనాలు చేసి నీటి నిల్వలను లేకుండా అవగాహన కల్పించి దోముల పెరుగుదలను అరికట్టే విధంగా చూడాలని ఆదేశించారు. దీని వలన దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యు మొదలైన వ్యాధులను ఆరికట్ట వచ్చునని తెలిపారు. ఎవరైనా జ్వర లక్షణాలు కలిగి ఉన్నట్లయితే వారికి నిర్ధారణ పరీక్షలు చేసి తగు చికిత్సలు ఇవ్వాలని ఆదేచించారు. ఆ వివరాలను ఫ్రైడే డ్రైడే యాప్‌లో అప్ లోడ్ చేయాలని, నీటినిల్వలు, చెత్త కుప్పలు ప్రాంతాలను ఫొటో తీసి నెక్టార్ కంట్రోల్ హైజన్ ఎస్‌లో అప్ లోడ్ చేసి పంచాయతీ, మునిసిపల్ సిబ్బంది సమన్వయంతో వాటిని తొలగించు నట్లు చూడాలని ఆదేశించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం సర్వేను తనిఖీ చేసి గర్భిణీ, పిల్లలకు సమయాను సారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదేనీ కారణం వలన ఇవ్వనట్లయితే లెఫ్ట్ అవుట్ , డ్రాప్ అవుట్ ఆగష్టు 7 నుండి 12 వ తేది వరకు టీకాలు వేయించుకోవాలన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం నందు . 0-5 సంవత్సరాల పిల్లలకు గర్భిణీలకు టీకాలను వేయించి ఆ వివరాలను ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ఈ కార్యక్రమములో వైద్యాధికారి డాక్టర్ మౌనిక డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును పంపిణీ చేస్తున్న కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయమనోహరి, నాయకులు

కెడిసిసిబి అభివృద్ధికి కృషి

- జగన్నన్న నమ్మకాన్ని నిలబెడతాం

- కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ఎస్‌వి.విజయమనోహరి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా సహకర కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా ఎస్‌వి.విజయ మనోహరి శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం భారీ జన సందోహం మధ్య నిర్వహించారు. ముందుగా ఆమె మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. తమ స్వగృహం నుండి వైసిపి నాయకులు , కార్యకర్తలతో ప్రదర్శనగా ప్రమాణ స్వీకార ప్రదేశానికి వెళ్లారు. ఆమె వెంట భర్త ఎస్‌వి. మోహన్ రెడ్డి , విజయ పాల డైరీ ఛైర్మన్ ఎస్‌వి జగన్ మోహన్ రెడ్డి , ఎస్.రామచంద్ర రెడ్డి , నాగ రత్నమ్మ, తనయులు ఎస్‌వి జనక్ రెడ్డి, ఎస్‌వి సాయి జైదీప్ రెడ్డిలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వేలాది మందితో నగర పుర వీధుల గుండా లక్ష్మి ఫంక్షన్ హాల్ కు చేరుకున్నారు. కెడిసిసి బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబం నకు బ్యాంకుకు విడదీయారని బంధం ఉందన్నారు. తన మామగారు ఎస్ వి సుబ్బారెడ్డి గతంలో జిల్లా ఛైర్మన్ గా, ఆప్కాబ్ ఛైర్మన్ పదవిని చేపట్టారన్నారు. బ్యాంకు టర్నోవర్ ను రూ.3000 కోట్ల నుండి రూ.4000 కోట్లకు తీసుక వెళ్ళడానికి కృషి చేస్తా అని తెలిపారు. మా కుటుంబంలో పాడి పంటలను తమకు జగన్నన్న అప్పగించారన్నారు. విజయ పాలడైరీ ఛైర్మన్‌గా ఎస్‌వి. జగన్ మోహన్ రెడ్డి , పాడి పరిశ్రమను, తనకు పంటలను జగనన్న అప్పగించారని తెలిపారు. వైసిపి నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు

సమగ్ర చట్టం చేయాలి

- మార్కెట్ యార్డులో సిఐటియు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పని భద్రత, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతూ శుక్రవారం మార్కెట్ యార్డులో కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో సంతకాలసేకరణ చేపట్టారు. కర్నూలు న్యూసిటీ హమాలీఫెడరేషన్, సిఐటియు నాయకులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ యూనియన్ అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు అధ్యక్షతవహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, సిఐటియు మార్కెట్ యార్డు యూనియన్ గౌరవం అధ్యక్షుడు టి. రాముడు మాట్లాడుతూ హమాలీకార్మికుల సంక్షేమం గురించి పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. హమాలి కార్మికులు తమ శ్రమనే నమ్ముకుని 50 కేజీలు, 100 కేజీల మూటలను మోస్తూ యజమాని ఇచ్చేచాలీచాలని కూలీతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలనుచదివించుకుంటూ, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. కార్మికులు అధిక బరువు మోయడం, పనిగంటలు లేకపోవడం కొన్ని సంస్థల్లో రోజుకు 13 గంటల నుండి 14 గంటలు కొన్నింటిలో 24గంటలు ఏకదాటిగా పని చేయాల్సి రావడం వల్ల వయసు మళ్లక ముందే కీళ్ల, నడుమునొప్పులు బారిన బడిచిన్నవయసులోనే ముసలితనంలోకి నెట్టివేయబడుతున్నారన్నారు. ఆరోగ్యాన్ని బాగుచేసుకోవడానికి అప్పులు తెచ్చుకుని బాగుచేసుకోవాల్సిన దుర్భరపరిస్థితి ఉందన్నారు. పనిప్రదేశంలో ప్రమాదంజరిగిన, ప్రమాదవశాత్తు మరణించినా పట్టించుకునే నాథుడేలేడన్నారు. కార్మికుల కష్టాలను, యోగక్షేమాలను పట్టించుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా హమాలి కార్మికుల బాగు కోసం పని భద్రత కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇఎస్ఐ పిఎఫ్ ప్రమాద బీమా, , కార్మికులకు రూ.పదివేలపెన్షన్, ఇల్లు లేని కార్మికులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్మికుల పిల్లలను ఉచిత చదువును అందించాలని, కార్మికుల పనిప్రదేశంలో తాగునీరు, విశ్రాంతి గదులు వంటి వసతులు కల్పించాలన్నారు. ఈనెల నెల21 నుండి 31వరకు హమాలీ కార్మికులతో సంతకాలు సేకరించి ప్రజాప్రతినిధులు, మంత్రులకు, వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఆగస్టు 2న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సుకు హమాలీ యూనియన్ నాయకులు అందరూ హాజరు కావాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గాంధీవిగ్రహాలకు మెమొరాండాలు ఇవ్వాలని, ఆగస్టు 17న జిల్లాకలెక్టర్ కార్యాలయం ముట్టడిలో హమాలీకార్మికులుపెద్దసంఖ్యలోపాల్గొలని కోరారు. మార్కెట్ యార్డు లారిహమాలి యూనియన్ కార్యదర్శి యు.బీసన్న, ట్రెజరర్ కెబి.రామకృష్ణ, బి. వెంకట స్వామి, మౌలాలి, సి.రామకృష్ణ, బి.నాగన్న పాల్గొన్నారు.

పెద్దపాడు వంతెనకు మరమ్మతు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరానికి కూత వేటు దూరంలో పెద్దపాడు వద్ద వక్కెర వాగు బ్రిడ్జిపై పడిన గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతు చేసి వాహనాల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకులకు అంతరాయం ఏర్పడుతుందని, వేగంగా వచ్చిన వాహనాలు ఆ గుంతలో పల్టీలు కొడుతున్నాయన్నారు. సిపిఎం ప్రతినిధి బృందం ఆ బ్రిడ్జి దగ్గర ఉన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ బ్రిడ్జిపై పడిన ఈ గుంతలను తక్షణమే మరమ్మతు చేపట్టాలని, లేకపోతే వాహనాదారులు బ్రిడ్జి పై నుండి కింద పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆర్అండ్‌బి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ , జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్ ఉన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, నాయకులు

చంద్రబాబును కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తుగ్గలి

మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, మాజీ వైస్ ఎంపిపి బిసి చంద్రశేఖర్ యాదవ్ శుక్రవారం చంద్రబాబు నివాసంలో కలిశారు. టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాలు నాయుడు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కెఇ. శ్యాంబాబు ఆధ్వర్యంలో తాము పనిచేస్తున్నామని ఆయనను గెలిపించే బాధ్యత తీసుకొని మండలంలో అత్యధిక మెజార్టీతో నిలపడతామని చంద్రబాబుకు తెలిపామన్నారు.

జెసిని కలిసిన డివిఎంసి సభ్యులు ప్రభుదాస్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ప్రభుదాసు శుక్రవారం ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపులకు మరమ్మత్తులు నిర్వహించి షాపుల ధరలను నిర్ణయించి కార్పొరేషన్‌కు ఆదాయాన్ని పెంచాలని అన్నారు. కార్పోరేషన్ నిర్ణయించిన షాపులో బాడుగలను గత 20 ఏళ్లుగా బాడుగదారులు కనీస మొత్తాలను కూడా కార్పొరేషన్ కు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు. పెండింగ్ బాడుగలను వెంటనే వసూలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా షాపుల ధరలను నిర్ణయించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరారు. జెసి స్పందిస్తూ సదరు షాపుల యజమాన్యాలకు నోటీసులు పంపించినందుకు జెసికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ఇలా ఉంటే..వెళ్లేదెలా..!

మారందొడ్డి ఎస్‌సి కాలనిలో రోడ్డుకు అడ్డంగా వేసిన కంచె

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని ఎస్‌సి కాలనిలో ఏళ్లుగా రోడ్డు అద్వాన్నంగా మారింది. అదే వర్షాకాలం వస్తే ఇలా తీవ్ర స్థితికి చేరుతుందని ఎలా వెళ్ళాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు తిరిగితే ప్రమాదాలు జరుగుతాయని తెలిసి ఈ కాలనీలోకి ఎవరూ రాకండని అడ్డంగా ముళ్ల కంచె వేసి మీడియాలో తెలుపుతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగు రోజులకే ఎమ్మెల్యే సుధాకర్ సిసి రోడ్డుకు భూమి పూజా చేశారని నాలుగేళ్ళయినా ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేసారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ కాలనీ సమస్యలు పరిష్కరించాలని అధికారులతో వాపోయారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ. హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు నియోజకవర్గ వైసిపి అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డితో కలిసి కర్నూలు నగరం లోని ఆయా వార్డులలోని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీచేశారు. హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు మరింత చేరువగా సచివాలయలను ఏర్పాటు చేసి 100కు 95శాతం సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు కూడా 100శాతం పథకాలను అందించాలన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల కు అవసరమైన వివిధ ధ్రువపత్రాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇన్కమ్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ, రైస్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు సిత్రా సత్యనారాయణమ్మ, షేక్ అహ్మద్, వార్డ్ ఇంచార్జిలు, స్పెషల్ ఆఫీసర్, సచివాలయం సిబ్బంది, సచివాలయం కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరపాలక సంస్థ పాలకమండలి ఏర్పడిన తర్వాత సంవత్సరానికి ఐదుగురు కార్పొరేటర్ల చొప్పున స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. గత రెండు సంవత్సరాల్లో రెండో స్టాండింగ్ కమిటీ సమయం పూర్తి కావడంతో మూడో స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కోసం ఎన్నిక షెడ్యూల్ విడుదల చేసిన తరువాత పదిమంది కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ కోసం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్లు ఉపసంహరణ ఉండటంతో నామినేషన్లు వేసిన వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్ల తో 12వ వార్డుకు చెందిన అన్నే పోగు క్రాంతి కుమార్, 39వ వార్డు చెన్నబోయిన సాంబశివరావు, ఒకటో వార్డు పి.షాషావలి, పదవ వార్డు షేక్. యూనుస్ బాష, 48వ వార్డు సోంపల్లి కష్ణకాంత్ లు తమ నామినేషన్లను సంహరించుకున్నారు. దీంతో 29వ వార్డు సంఘాల సుదర్శన్ రెడ్డి, 20వ వార్డు ఆత్మకూరు నాగలక్ష్మి రెడ్డి, 45వ వార్డు నగరూరు. శ్రీనివాసరావు, 17వ వార్డు కె.పద్మలత, జిఎల్‌వి సుజాతలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వారు ఆగస్టు ఒకటవ తేదీన స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి : ఎస్‌పి

ఓర్వకల్లు స్టేషన్‌ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మర్యాదగా వ్యవహించాలని కర్నూలు ఎస్‌పి జి.కృష్ణ కాంత్ సూచించారు. ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పోలీసులు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యాయం కోసం పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి చట్ట ప్రకారం న్యాయం చేయాలన్నారు. స్టేషన్ నిర్వహణపై ఎస్‌పి పలు సూచనలు చేశారు. ఎస్‌పి వెంట కర్నూలు రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, ఓర్వకల్లు ఎస్‌ఐ రాజా రెడ్డి ఉన్నారు.

నవధాన్యాల సాగు పుడమికి బాగు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను తెలుపుతున్న అధికారులు

ప్రకతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగు నాలుగు ఎకరాలలో గాయత్రి గోశాలలో ఉన్న గోవులకు మేతను అందించేందుకు గోశాల సమీపంలో వున్న నాలుగు ఎకరాలలో నవధాన్యాల సాగును జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిని పి.లలిత వరలక్ష్మి, కర్నూలు ఎడిఎ సాలురెడ్డి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, టెక్నికల్ వ్యవసాయ అధికారి దస్తగిరి రెడ్డి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్ శుక్రవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ నవధాన్యాల సాగు నుండి వచ్చిన మేత ఎక్కువ రకాల మేతను తినడం వల్ల గోవులు ఆరోగ్యంగా ఉంటాయని, గోవులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పిఎండిఎస్, నవధాన్యాల సాగు, బీజామతం విత్తన శుద్ధి చేసి వేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. పలు పంటలు భూమిపై వేయడం ద్వారా మొక్కలు భూమిలోకి స్రవించే చక్కెర పదార్థాలలో కూడా వైవిధ్యం ఉంటుందన్నారు. భూమిలో ఏర్పడే సూక్ష్మజీవుల సమూహాలలో కూడా వైవిధ్యం ఏర్పడుతుందన్నారు. ఘనజీవామృతం, ద్రవజీవామతం తయారీ విధానం గురించి, 20 నుంచి 30 రకాల విత్తనాలను వాడటం వాటి ప్రయోజనాల వల్ల కలిగే లాభాల గురించి తెలిపారు. నవధాన్య సాగు విధానం వల్ల పంట దిగుబడులు పెంచేందుకుగాను నెలలో సూక్ష్మజీవుల వృద్ధి పోషకాలు తగిన మోతాదులో పెంచడానికి నీళ్లలో నీటి సంగ్రహణ శక్తి పెరిగి వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటల సాగుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరచడానికి నవధాన్యాల సాగు విధానం పాటించాలని తెలిపారు. చీడపీడలు, తెగుళ్ళను తట్టుకుంటుందని తట్టుకోగలుగుతుందన్నారు. నేల కోతను అరికడుతుందని నేలగుల్ల వారి వానపాముల వృద్ధి జరుగుతుందని తెలిపారు. విత్తన గుళికల తయారీ విధానం, వాటి లాభాల గురించి తెలిపారు. మహిళలందరూ తమ ఇంటి ముందు ఉన్న స్థలాల్లో కిచెన్ గార్డెన్స్, లేదా సూర్య మండలం వంటి వాటిలో ఆకుకూరలు, కూరగాయలు వేసుకుని ప్రకతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైనటువంటి ఆహారం తీసుకోవాలని తెలిపారు. రామేశ్వరమ్మ , మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున, వేణుగోపాల్ , ఓమేశ్వరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కవిత్వం నీ శ్వాస...!



ఒక్క రోజు కవిత రాయక పోతే
శ్వాస ఆడదని,
పేరు కవి అని, యింటి పేరు
చైతన్యమని, కవిత్వమే
మాతృ భాష అని, యితి వత్తం
మాన వత్వమని, సంప్రదాయం
గతించదని, కడివెడు పాల పయి
పేరిన మీగడ యని, నిట్టూర్పుల
వంతెన నుండి నిజాయితీని
చేరు కుంటానని, నిరాశల ఊడలను పట్టుకొని నింగి అంచులను అందుకుంటానని, పరుల బాధ పంచు కున్న వాడే కవి యని, కవి సూర్యుడూ ఒక్కరే యని, యిరువురు సప్తవర్ణాలను జీర్ణించు కొని శ్వేత కాంతిని విరజిమ్మే తేజో మూర్తు లని, బంగారు కవితల్లో పలికిన జ్ఞాన పీఠ కవీశ్వర.. శరీరం మట్టిలో కలిసినా కవి ఆలోచన లూ, ఆశయాలు జీవించే ఉంటాయని పలికిన నీవు తెలుగు భాషలా చిరంజీవి వయి మా హృద యాలయంలో జీవించే ఉంటావు, తెలుగు తల్లిని నీ కవితా ధారలతో అభిషేకిస్తూనే ఉంటావు, సినారె నీవు చిరాయువు నీ కవితా మృతంతో

నేడు డాక్టర్ సినారె జయంతి

-డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా

తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల

- ఎల్ఎల్సి, హెచ్ఎల్సి కాలువల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి - హోళగుంద/ఆదోని

తుంగభద్ర డ్యాం నుంచి కర్నాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో తాగునీటి కోసం తుంగభద్ర దిగువ కాలువ, ఎగువ కాలువల ద్వారా నీటిని శుక్రవారం విడుదల చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేసినట్లు బోర్డు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ ప్రాంతంలో తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు కోరారు. తుంగభద్ర డ్యాంలోను నీరు 50 టిఎంసిల నిల్వ దాటడంతో కర్నూలు, అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, విజయనగరం, రాయచూరు, కొప్పల జిల్లాలకు తాగునీటి కోసం విడుదల చేస్తున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. త్వరలో బోర్డు సమావేశం నిర్వహించి సాగు కోసం నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు నాగేంద్ర, బోసరాజులు త్వరలోనే సమావేశమై నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటారని కర్ణాటక రాష్ట్ర సాగు నీటి సంఘం నాయకులు పురుషోత్తం గౌడ్ తెలిపారు. నీటి విడుదల విషయం ఇద్దరు మంత్రులకు ఫోన్ ద్వారా వివరించానని, వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే నీటిని విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.

కాలువ ద్వారా పారుతున్న నీరు

చంద్రబాబుతో ఆదోని నియోజకవర్గం నాయకులు

ఆదోనిలో టిడిపిని గెలిపించాలి

- బాబును కలిసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి ఆదోని నియోజకవర్గ కార్యవర్గం చంద్రబాబుతో మంగళగిరిలో చర్చలు ముగిశాయి. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారని నాయకులు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ సమీక్ష సమావేశానికి నియోజకవర్గ ఇన్ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మాజీ ఇన్ఛార్జ్ గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకులు దేవేంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్ఛార్జిలు బుద్దారెడ్డి, లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ బసవ, ఆదిశేషిరెడ్డి, శివప్ప, తిమ్మప్ప, వేణుగోపాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలో టిడిపి పనితీరు, రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీని ఎలా ఎదుర్కోవాలని, టిడిపి కార్యకర్తలు ఏ విధంగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నారని, ఇంకా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, ఏవిధంగా బలపరుచుకోవాలని సూచనలు చేస్తూ రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలని చంద్రబాబు సూచించినట్లు నాయకులు తెలిపారు. సమిష్టిగా కృషి చేయాలని స్పష్టం చేసినట్లు వివరించారు.

రాయలసీమ ద్రోహి జగన్

- టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

ప్రజాశక్తి-ఆలూరు

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడంలో జగన్ ద్రోహం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తిక్కారెడ్డి, ఉమాపతి నాయుడు విమర్శించారు. శుక్రవారం పశ్చిమ ప్రాంత జీవనాడి వేదవతి నిర్మాణం నిధులు లేక నిలిచిపోవడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం చేతకానితనం వల్ల వేదవతిని ఆపేసి ఆలూరు నియోజకవర్గ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. ప్రజలకు తాగు, సాగునీరు అందించలేని వైసిపి ప్రభుత్వం నియోజకవర్గంలో వీధివీధికి అక్రమ కర్ణాటక మద్యం అందిస్తోందని ఎద్దేవా చేశారు. ఇలాంటి ప్రభుత్వాలను, పాలకులను ఇంటికి పంపించే సమయం దగ్గరలోనే ఉందన్నారు. అంతకుముందు హాలహర్వి మండలం కామినహల్ గ్రామంలో హజరత్ హిమామ్ హుస్సేన్ పీర్లను దర్శించుకున్నారు. టిడిపి ఆలూరు, హాలహర్వి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిలిచిన వేదవతి పైపులను చూపుతున్న నాయకులు

పరిసరాల అపరిశుభ్రత ప్రమాదం

- సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది పలు రకాల వ్యాధులను వ్యాపింపజేస్తాయి. దోమకాటుతో ప్రజలు జ్వరాల బారినపడే ప్రమాదం ఉంది. వాటిల్లో ముఖ్యంగా దోమకాటు ద్వారా సంభవించే డెంగీ జ్వరం. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కోసం ప్రతేడాది జులైను డెంగీ వ్యతిరేక మాసంగా ప్రకటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డెంగీ జ్వరం లక్షణాలు

పగటి పూట కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు వాంతులు, తలనొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు భ్రాంతి కలగడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడి, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కో సారి రక్తస్రావం జరుగుతుంది. రక్తపరీక్ష చేసి ఎలీసా పద్ధతిలో డెంగీ జ్వరాన్ని నిర్ధారణ చేస్తారు.

దోమలు పెరిగే ప్రదేశాలు

డెంగీ జ్వరాన్ని కలుగజేసే దోమలు నీటిని నిల్వ చేసే ప్రదేశంలో పెరుగుతాయి. వాడి పడేసిన వస్తువులు, నిల్వ ఉండే నీటిలో దోమ పిల్లలు పురుగుల వలే కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, తొట్టెలు, రుబ్బురోళు, వాడి పడేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, వాడి పడేసిన కొబ్బరి చిప్పలు, బొండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీల్లో, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో దోమ లార్వాలు పెరుగుతాయి. డెంగీపై అవగాహన లేకపోతే ఇల్లు, ఒళ్లు గుల్ల కావాల్సిందే. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట జ్వర బాధితుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. డెంగీపై అవగాహన కలిగి ఉండిజాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండవచ్చు.

బాధితులను గుర్తిస్తూ... చికిత్స అందిస్తూ..

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల బెడద పెరిగి, వివిధ రకాల జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. మలేరియా, డెంగీ, డయేరియా వంటివి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటిని అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రామంలో ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లతో కలిసి ఈ వ్యాధులన్నింటికీ ముఖ్య లక్షణం జ్వరం కావడంతో ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టింది. పంచాయతీల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్తున్న వైద్య సిబ్బంది జ్వరాలతో బాధ పడుతున్న వారి వివరాలు సేకరిస్తోంది. ఆ వివరాలను ఫీవర్ సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఏ మాత్రం జ్వరం లక్షణాలు కనిపించినా మలేరియా, డెంగీ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. జ్వరం ఎన్ని రోజుల నుంచి ఉంది. ఇతర లక్షణాలేమిటో తెలుసుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించి, చికిత్స అందిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తే బాధితులకు వెంటనే వైద్య సేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి జ్వరం ఉన్నట్లు గుర్తిస్తే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించడంతో పాటు అక్కడ పారిశుధ్యం మెరుగుదలకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ సర్వే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎంతో ఉపకరిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

సర్వే చేస్తున్న ఎఎన్ఎం, ఆశావర్కర్

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

- పెద్దహరివాణం పిహెచ్‌సి వైద్యులు అఫ్రాన్

అధికార యంత్రాంగం తీసుకునే చర్యలతో పాటు ప్రజలు సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తిపై అవగాహన కలిగి ఉండాలి. ఫీవర్ సర్వేకు సహకరించాలి. ఇంట్లో, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందాలి. సీజనల్ వ్యాధులు, దోమల వృద్ధిని అరికట్టేందుకు వైద్య, ఆరోగ్య శాఖాధికారులు కృషి చేస్తున్నారు.

నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

కల్లుకుంటలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-పెద్దకడుబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో గత కొద్ది రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామానికి ఐదు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు సరఫరా చేస్తున్న తాగునీరు కుటుంబాలకు సరిపోవడం లేదని, మూడు రోజులకే తాగునీరు సరిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామస్తులు ఖర్చు చేసి తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు గ్రామ సమీపంలో ఉన్న గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్‌కు గండి ఏర్పడిన చోటుకెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వేసవిలోనైనా తాగునీటి కష్టాలు ఎదుర్కోలేదని, వర్షాకాలంలో తాగునీటి కష్టాలను ఎదురుకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

'జల్ జీవన్'పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన అవసరమని జల్ జీవన్ మిషన్ జిల్లా ఐఇసి కోఆర్డినేటర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. జల్ జీవన్ మిషన్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశం జరిగింది. సిడిపిఒ సమీరున్నీసా బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి లక్ష్మీ నారాయణ మాట్లాడారు. జల్ జీవన్ మిషన్, దానికి సంబంధించిన లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ నీరు, పారిశుధ్య కమిటీలో అంగన్వాడీల పాత్ర, నీటి నాణ్యత కమిటీలో, నీటి నాణ్యత పరీక్షల కిట్, చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పారిశుధ్యత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. మనిషి ఆరోగ్య వ్యవస్థపై నీటికి ఉన్న ముఖ్యపాత్రను వివరిస్తూ గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు చేయించడంలో భాగస్వాములై మహిళలు, ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ ప్రీతి పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి-పెద్దకడుబూరు

మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో 192, 193, 195వ నెంబర్లు గల బూత్‌లలో ఓటరు జాబితా పరిశీలన చేపట్టారు. శుక్రవారం బూత్ లెవెల్ అధికారులు రవితేజ, పుణ్యవతి, ఆశాజ్యోతితో కలిసి యూనిట్ ఇన్‌ఛార్జీ వీరేష్ గౌడ్, బూత్ ఇన్‌ఛార్జీలు నరసింహులు, రవి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఆ కుటుంబంలో ఉన్న ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు కార్డులో తప్పులుంటే సవరించుకోవాలని సూచించారు. అర్హులైన యువత ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు ఆపాలి

- మణిపూర్ హింసకాండకు నిరసనగా క్రైస్తవుల భారీ ర్యాలీ
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - నందవరం

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ఆపాలని క్రైస్తవులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడి, చర్చిలను కూల్చి వేసిన సంఘటనలకు నిరసనగా శుక్రవారం నందవరం మండలంలో ఉన్న ఐఎంబి సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ రఘువీరాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు ఎక్కువయ్యాయని, దాడులపై మణిపూర్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక సంఘ కాపరి రెవరెండ్ బండారి ప్రసాద్, నాగలదిన్నె సంఘ కాపరి ప్రసాద్, రాయచోటి సంఘ కాపరి ఏసేపు, గురజాల చార్లెస్, సోమలగూడూరు భోజరాజ్, స్థానిక సంఘ సెక్రటరీ పోతప్ప పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం అందిస్తున్న క్రైస్తవులు

గ్రామాల్లో స్వచ్ఛ, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత : ఇఒఆర్‌డి

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో స్వచ్ఛ, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇఒఆర్‌డి సంజన తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోడపత్రికలను, కరపత్రాలను గ్రామ వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మలవిసర్జన బయట చేయడంతో అంటువ్యాధులు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ బృందాలు గ్రామాలకు వచ్చి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల కోసం ఉపన్యాసాలు ఇస్తారని కర్నూలు డిపిఒ కార్యాలయం తెలిపిందన్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు నాగభూషణం, బాలన్న, నరేంద్ర, రామాంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గోడపత్రికలు విడుదల చేస్తున్న అధికారులు

మణిపూర్ ఘటన అమానుషం

- 31న జరిగే శాంతి ర్యాలీని జయప్రదం చేద్దాం
- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటన అమానుషమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఓ కళాశాలలో క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శాంతరాజు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, నీలకంతప్ప, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుడిసె శివన్న, పాస్టర్ ఆనంద్ రాజు, మహిళా నాయకులు సుజ్ఞానమ్మ, మణి, మానవ హక్కుల వేదిక నాయకులు యుజి.శ్రీనివాసులు, ఆది భారతీయ సమాజం నాయకులు మహదేవప్ప, అమల్ నాథన్, తిప్పన్న, టిడిపి నాయకులు మల్లి, రైతు నాయకులు ఆదినారాయణ రెడ్డి, డిహెచ్‌పిఎస్ నాయకులు వీరేష్, నరసన్న, ప్రసాద్, దస్తగిరి నాయుడు, భాస్కర్, నేతప్ప, సునీల్, సంగటి దేవదానం, శ్రీధర్, అక్బర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. మే నెల మొదటి వారంలో ప్రారంభమైన దమనకాండ గురించి బయట ప్రపంచానికి తెలియకుండా ఇంటర్‌నెట్‌ను బంద్ చేశారని తెలిపారు. మహిళలను వివస్త్రను చేసి ఊరేగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరోధించడానికి కృషి చేయాల్సిన ప్రధాని మోడీ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈనెల 31న జరిగే శాంతి ర్యాలీకి సిపిఎం మద్దతి ఇస్తుందని నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన్న తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన రైతు గుడిసి రాజు (34) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు రాజు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో గత రెండేళ్లుగా పంటలు పండక రూ.8 లక్షల వరకు అప్పులు మిగిలాయి. మనోవేదనకు గురై తెల్లవారుజామున పురుగు మందు తాగారు. తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలే మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

- పీర్ల చావడి దగ్గర పండగ వాతావరణం

ప్రజాశక్తి - ఆస్పరి

పెద్ద సరిగెత్తు సందర్భంగా ఆస్పరి, శంకరబండ, తంగరడోన, చిగిలి, హలిగేర, కైరుప్పల, కారుమంచి, నగరూరు, బనవనూర్, ములుగుందం గ్రామాల్లోని పీర్ల చావిళ్ల దగ్గర భక్తులతో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం పీర్ల చావడి ముందు అలా గుంత చుట్టూ లేకుండా 'సావుసన్' ఆడుతున్న వారిని చూసేందుకు పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పీర్లకు బెల్లం పానకం, ముడుపులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పీర్లను చావడి నుంచి మేళతాళాలతో గ్రామ పురవీధులకుండా ఊరేగించారు. అడుగడుగునా బిందెలతో నీళ్లు పోసి పీర్లను దర్శించుకున్నారు. పీర్ల పండగ సందర్భంగా కళాకారులు వివిధ వేషధారణలతో ప్రజలను ఆకట్టుకున్నాయి.

దేవనకొండ : దేవనకొండలో మొహర్రం వేడుకల్లో శుక్రవారం గ్రామస్తులు వేసిన వేషాలు చూపరులను అలరించాయి. పొట్టేలు, ఎలుగుబంటి, ఆడ, దొంగ వేషాలతో ప్రధాన వీధులు, పీర్ల చావిళ్ల వద్ద పిల్లల కేరింతలతో, డప్పు వాయిధ్యాలతో సందడి నెలకొంది. పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్ల మసీదులో పీర్లను పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తాదులు పీర్ల చావిళ్ల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో మొహర్రం వేడుకల్లో భాగంగా గ్రామాల్లో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నంచర్లలో 12 గంటల్లోపు... నీటి సరఫరా పునరుద్ధరణ

- గుమ్మనూరు నారాయణ చొరవతో యుద్ధప్రాతిపదికన చర్యలు
- మొహర్రం వేళ నీటి సమస్యను తీర్చినందుకు కృతజ్ఞతలు తెలియజేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నంచర్ల గ్రామంలో భవాని దేవాలయం వద్ద ఉన్న బోరుకు సంబంధించి మోటారు పాడైపోవడంతో శుక్రవారం గ్రామంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొహర్రం పండగను ఏటా కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా గడపడం ఆనవాయితీ. అలాంటిది పండగ వేళ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు 12 గంటల పాటు నీటికి ఇబ్బందులు పడ్డారు. గ్రామ సమీపంలో ఉన్న నీటి పథకాలు, కుళాయిల వద్ద ఎక్కడ చూసినా బిందెలతో పిల్లాపెద్దలు బారులు తీరారు. నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు స్థానికంగా ఉన్న వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచి భీమా శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. బోరులో ఉన్న మోటారు పాడైపోవడంతో కొత్త మోటార్ అవసరం ఏర్పడింది. ఈ విషయాన్ని వారు ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే చొరవ తీసుకుని బోరుకు అవసరమైన కొత్త మోటారును సమకూర్చారు. గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి నరసింహులు స్థానికంగా ఉన్న మెకానిక్ సహాయంతో బోరుకు కొత్త మోటారును అమర్చారు. వెంటనే గ్రామంలో నీటి సరఫరా పునరుద్ధరణ జరిగింది. మొహర్రం పండగ వేళ నీటికి ఇబ్బంది పడిన ప్రజలకు కొత్త మోటారు ఏర్పాటుతో నీటి సరఫరాకు అంతరాయం తొలగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన బోరుకు అవసరమైన కొత్త మోటారును సమకూర్చి నీటి సమస్యను తీర్చినందుకు గ్రామస్తులు గుమ్మనూరు నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయం విషయాన్ని కూడా వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచి భీమలింగ నారాయణ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ... రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సహకారంతో మండల విద్యుత్ అధికారులతో చర్చించి చిప్పగిరి నుంచి గ్రామానికి ప్రత్యేకంగా విద్యుత్ లైను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

కొత్త మోటార్‌ను అమర్చుతున్న మెకానిక్

కప్పట్రాళ్లలో బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో చింతమాను శివలింగప్ప ఇంటి దగ్గర 'సే ట్రీస్' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ యూనిట్‌ను ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'సే ట్రీస్' సంస్థ రూ.40 వేల విలువ గల బయోగ్యాస్ ప్లాంట్‌ను ఉచితంగా శివలింగప్ప కుటుంబానికి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ పశువుల పేడ ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. దీని ద్వారా కుటుంబంపై ఎల్‌పిజి గ్యాస్ భారం పడకుండా పశువుల పేడతో ఇంటి దగ్గర సొంతంగా గ్యాస్ తయారు చేసుకోవచ్చన్నారు. ఎల్‌పిజి గ్యాస్ ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బయోగ్యాస్‌లో ఉపయోగించిన పశువుల పేడను మళ్లీ గ్యాస్ ఉత్పత్తి అయిన తర్వాత ఈ ద్రావణాన్ని పండ్ల మొక్కల పెరుగుదలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రిసోర్స్ పర్సన్ చింతమాను రవికుమార్, గ్రామ సంఘం విఒఎ సుధాకర్, రైతు శివలింగప్ప కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ నారాయణ

ఓటరు జాబితాను బాధ్యతతో సర్వే చేయాలి : వైసిపి

సర్వే చేస్తున్న వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఓటరు జాబితాను బాధ్యతతో సర్వే చేయాలని వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని 52 బసాపురం గ్రామంలో ఓటరు జాబితా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు గ్రామ ఓటరు జాబితా సర్వేలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఓటరు జాబితాలో పేరు లేదని అనుమానం కలిగితే ఒకసారి జాబితాలో తమ పేరు ఉందా లేదా అని తెలుసుకుని లేదని గుర్తిస్తే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని బిఎల్‌ఒలను కోరారు. విఆర్‌ఒ హరిత, బూత్ కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో షాపులకు పన్నులు వేయాలని దరఖాస్తులు

- రసాభాసగా మున్సిపల్ సమావేశం
- టిడిపి, వైసిపి సభ్యుల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వీవర్స్ కాలని ప్లే గ్రౌండ్‌లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాపులకు పన్నులు కట్టించుకోవాలని షాపులు నిర్వాహకులు సచివాలయానికి దరఖాస్తు పెట్టుకున్నారని మున్సిపల్ టిడిపి కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ విజిఎ.దయాసాగర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగింది. అజెండా అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడారు. మున్సిపల్‌కు చెందిన గ్రౌండ్ స్థలంలో షాపులు తొలగిస్తామని కమిషనర్ చెప్పారని, ఇంతవరకు తొలగించలేదని తెలిపారు. షాపులకు పన్ను వేయాలని దరఖాస్తు వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. కమిషనర్ సమాధానం చెప్పాలని కోరారు. రామస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ మున్సిపల్ షాపులు నిర్వాహకులు ఐదేళ్ల నుంచి అద్దె చెల్లించడం లేదన్నారు. అద్దెలు వసూలు చేయాలని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని 2023 మార్చికి పూర్తి చేస్తానని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి హామీ ఇచ్చారని, ఇంతవరకు పూర్తి చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్ కు బిల్లులు అందకపోవడంతో పనులు ఆపేశారన్నారు. వర్షాలకు మ్యాన్ హోల్స్ కుంగిపోయి రోడ్లపై నీరు ప్రవహిస్తోందని తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ... షాపులకు పన్నులు వేయబోమని, షాపులను తొలగిస్తామని, షాపుల అద్దెలు వసూలు చేస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, టిడిపి కౌన్సిలర్ దయాసాగర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గ్రౌండ్‌లో షాపులు తొలగింపు, ఆస్తి పన్ను వేయాలని దరఖాస్తు చేయడంపై ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

పీర్లను దర్శించుకున్న మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-హాలహర్వి

మండలంలోని కామినహల్ గ్రామంలో వెలసిన హజరత్ హిమామ్ హుస్సేన్ పీర్లను శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి సాంప్రదాయబద్ధంగా చక్కెరతో తులాభారం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన దేశంలోనే ఆదర్శంగా ఉందని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, జడ్‌పిటిసి లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, కామినహల్ సర్పంచి భర్త జనార్ధన్ నాయుడు, చిప్పగిరి ఎంపిపి భర్త మారయ్య, వైసిపి ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, నాయకులు రంగారావు చంద్ర పాల్గొన్నారు.

తులాభారంలో మంత్రి గుమ్మనూరు

'మహా పడావో'ను జయప్రదం చేయండి

- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి ఆదోని

ఆగస్టు 9న క్విట్ ఇండియా స్ఫూర్తితో 'క్విట్ మోడీ, సేవ్ ఇండియా' నినాదంతో విజయవాడలో జరిగే 'మహాపడావో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వక్తలు కోరారు. శుక్రవారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతివేకంగా చేపట్టే మహాపడావో కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు, ఐఎన్‌టియుసి నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎంకప్ప, నాయకులు చెన్నకేశవులు, ఎఐటియుసి నాయకులు బి.ఎంకన్న, నాయకులు భీమేష్, హుస్సేని, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న, ఐఎఫ్‌టియు నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఓరల్ రీహైడ్రేషన్ థెరపీపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

వాంతులు, విరోచనాలైన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని చిన్నపిల్లల ప్రముఖ వైద్యులు గోపీనాథ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆదిత్య నర్సింగ్ హోమ్‌లో ఓరల్ రీహైడ్రేషన్ థెరపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాంతులు, విరోచనాలైన సమయంలో ఒఆర్ఎస్ ద్రావణం చిన్న పిల్లలకు, పెద్దలకు తాపించడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. అలాంటి సమయంలో ఒఆర్ఎస్ ఏ మోతాదులో ఇవ్వాలనే అంశంపై డాక్టర్లు రఘునాథ్, సూర్దాసు, హరీష్, గోపీనాథ్, ఆదిత్య, శ్రీనివాసులు అవగాహన కల్పించారు. శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్తంగా ఆదోని ఏరియా ఆస్పత్రిలో ఒఆర్ఎస్ వారోత్సవాలను నిర్వహించారు. ఎండ వేడిమికి, కలుషిత ఆహారం, నీరు తీసుకున్న సమయంలో వాంతులు, విరోచనాల బారినపడి ఓరల్ రీహైడ్రేషన్ ఏర్పడుతుందన్నారు. ఆ సమయంలో థెరపీ చేస్తే కోలుకోవచ్చున్నారు. వైద్యులను సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్‌గా రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన టి.నిశాంతిని బదిలీ చేశారు. అప్పటి నుండి జిల్లా కలెక్టర్ జెసి అదనపు బాధ్యతలు చూస్తున్నారు. కడప జిల్లాకు చెందిన టి.రాహుల్ కుమార్ రెడ్డి 2020లో ఏలూరులో ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2022 అక్టోబర్ 16న శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను ప్రమోషన్‌పై నంద్యాల జిల్లా జెసిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నెల 31న గాని, ఆగస్టు మొదటి వారంలో జెసిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

శివపురం చెరువుకు మళ్లీ గండి

- ఆరు రోజుల్లో రెండుసార్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- పంట పొలాల్లోకి నీరు
- రైతులే స్వయంగా మరమ్మతులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలో ఉన్న ఈర్ల చెరువుకు శుక్రవారం మళ్లీ గండి పడింది. వారం రోజుల వ్యవధిలోనే చెరువు కట్టకు రెండుసార్లు గండి పడడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. సంబంధిత మైనర్ ఇరిగేషన్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదు. అధికారులు కనీసం చెరువుకు ఎక్కడ గండి పడింది..? వాటి మరమ్మతులు ఎలా చేయాలనే విషయాన్ని కూడా పట్టించుకోకపోవడంతో చెరువు నీరంతా పంట పొలాల్లోకి చేరుతోంది. రైతులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్న పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఆదివారం రాత్రి ఈర్ల చెరువుకు గండి పడింది. వెంటనే స్థానిక సర్పంచి చంద్రశేఖర్ యాదవ్ గ్రామస్తులు, రైతులతో కలిసి సోమవారం గండిపడిన ప్రాంతాన్ని జెసిబి సహాయంతో మరమ్మతులు చేయించారు. శుక్రవారం చెరువుకు మళ్లీ గండి పడడంతో ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికే వర్షాలు కురిసి నష్టపోయిన రైతులకు మరో వైపు చెరువుకు గండిపడి పొలాలు నీట మునిగి పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టుగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులైనా స్పందించి చెరువుకు పడిన గండికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి పంట పొలాలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గండిని పూడ్చుతున్న రైతులు

చెరువుకు గండి పడి పొలాల్లోకి చేరిన నీరు

మొక్కలు నాటుతున్న కలెక్టర్ దంపతులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, కలెక్టర్ సతీమణి తమీమ్ అన్సారియాలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెరిగినప్పుడే గాలిలో ఆక్సిజన్ పెరుగుతుం దన్నారు. కార్యక్రమంలో డ్వామా పిడి రామచంద్ర రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు, డిఎఫ్ఓ ఎన్డికె ప్రసాద్, ఎంపీడీవో సుగుణ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారమివ్వాలి

- రైతు సంఘం, సిఐటియు, వ్యకాసం ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

నంద్యాల-కల్వకుర్తి జాతీయ రహదారి 167కే నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న రైతులకు, బాధితులకు 2013-భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పార్నపల్లి గ్రామంలో టిటిడి కళ్యాణ మండపంలో, బండి ఆత్మకూరులోని జనార్ధ స్వామి టెంపుల్ ఆవరణలో 167-కె జాతీయ రహదారి నిర్మాణం కోసం రైతుల నుండి భూసేకరణ చేయడం కోసం డాక్యుమెంట్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్డీవో దాస్, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ హరిత హాజరయ్యారు. రైతుల నుండి పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి, అడంగల్, ఈసిలను పరిశీలించి స్వీకరించారు. బాధిత రైతులకు, ఇళ్ల యజమానులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు వీరన్న, మండల సిఐటియు నాయకులు రత్నమయ్య, వ్యకాసం మండల నాయకులు రామచంద్రుడు రైతులతో కలిసి ఆర్‌డిఒ దాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ధర నిర్ణయించకుండా భూసేకరణ చేయకూడదని, 2013 ప్రకారం భూసేకరణ సేకరించాలన్నారు. ప్రభుత్వ విలువ ప్రకారం భూసేకరణ చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రైతుల అనుమతి తీసుకుని ధరలు నిర్ణయించిన తర్వాత భూసేకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రైతులను మభ్యపెడుతూ వారి నుండి డాక్యుమెంట్ల వెరిఫికేషన్ పేరుతో సంతకాలు స్వీకరించడం తగదన్నారు. బహిరంగ మార్కెట్లో ఎకరం ధర ఎంత ఉందో తెలియజేసి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు, రైతులు

వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి

- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో భారీ వర్షాలు, నదుల్లో వరద ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం తాడేపల్లి నుంచి సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, డిఆర్ఒ పుల్లయ్య తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పర్యటించాలని, ముంపు ప్రాంతాలు, పంటపొలాలను సందర్శించి బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. మానవత్వంతో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేయాలని, లోతట్టు, మునక ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు, సహాయ శిబిరాలకు తరలించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల, సచివాలయం స్థాయిలో సమాచార సేకరణ ఉండాలని, వాలంటీర్లను అప్రమత్తం చేయాలన్నారు. మునక ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతంలో నీటి దిగ్బంధనంలో ఉన్న ప్రజలకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, ఆయిల్, ఎర్రగడ్డ, ఉర్లగడ్డలు తదితర రేషన్ అందించాలని సూచించారు. ఇందుకు ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లు, ఎఫ్‌పి షాపులలో రేషన్ సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తాగునీటి ప్యాకెట్లు పంపిణీకు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వరద ప్రాంతాల్లో నీరు తగ్గి సహాయ శిబిరాల నుంచి ఇళ్లకు పంపేటపుడు కుటుంబానికి రూ. 2 వేలు, ఒక్కరే ఉంటే రూ. వెయ్యి ఇవ్వాలని తెలిపారు. వర్ష గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని చోట్లా బ్లీచింగ్, హెల్త్ క్యాంప్స్ చేయాలన్నారు. సిహెచ్సి, పిహెచ్సిలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లలో మందులు స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. వర్షాలకు పాములు వస్తాయి కావున యాంటీ డోస్ మందులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. దెబ్బతిన్న పాకలు, గుడిసెలు, గృహాలు తదితర ఆస్తి నష్టం వివరాల అంచనా నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకల పరివాహక ఆర్ అండ్ బి రహదారుల్లో నీటి ప్రవాహాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. తాగునీటి పైపు లైన్లు, రక్షిత మంచినీటి పథకాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈకి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిపిఓను ఆదేశించారు. జల వనరులు, మైనర్ ఇరిగేషన్ శాఖలు నదుల్లోని నీటి నిల్వలు, పై ప్రాంతాల నుండి వస్తున్న వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మండలంలో పెద్ద సరిగెత్తు వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాలలో పీర్లచావిడిలో కొలువైన పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని 32 పీర్ల చావిడీలలో కొలువైన పీర్లను పెద్ద సరిగెత్తు సందర్భంగా పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పీర్లకు పూలదట్టిలను సమర్పించి, ప్రత్యేక పాతేహాలు నిర్వహించారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని తిమ్మ నాయుని పేట, అంకిరెడ్డి పల్లె, గురుమానిపల్లె, బందార్లపల్లె, పెట్నికోటతోపాటు ఇతర గ్రామాలలో మొహరం వేడుకలను ఘనంగా జరిగాయి.

బనగాన పల్లెలో పీర్లకు ఫాతేహాలు నిర్వహిస్తున్న దృశ్యం

నాటుసారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని రాళ్ల కొత్తూరు తండా సమీపంలోని కొండల్లో నాటుసారా బట్టీలపై బనగానపల్లె సెబ్ సిఐ సుభాషిని శుక్రవారం దాడులు చేశారు. బెల్లంఊట ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నాయక్‌పై కేసు నమోదు చేసి నట్లు ఆమె తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దవెంతుర్ల గ్రామంలో మినుము పంటపై పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతుల ఎన్నిక, గ్రూపు ఏర్పాటు, ప్రారంభపు, ప్రాథమిక సర్వే నిర్వహణ, బ్యాలెట్ పెట్టె పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, ఎంపీఈవో మనోహర్, కమ్మవారిపల్లె సర్పంచ్ కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలో పొలం కాపరిగా ఉంటున్న పక్కీరను శుక్రవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాయు. వివరాలు.. దొర్నిపాడు మండలం గోవిందిన్నె గ్రామానికి చెందిన పక్కిర ఆలమూరు గ్రామ సమీపంలో పొలాలకు కాపరిగా ఉంటున్నాడు. అతను పొలంలో ఉండగా పాము కాటు వేసింది. అతను అస్వస్థతకు గురి కావడంతో కొంత మంది రైతులు గమనించి వెంటనే ఆలమూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. డాక్టర్ ప్రథమ చికిత్స అనంతరం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బాచాపురం గ్రామంలోని ఎంపిపి స్కూల్‌లో ఇన్సిట్యూషన్ ప్లాంటేషన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఇఒ శోభా వివేకవతి, ఎపిఒ గణేష్, ఇసి రంగయ్య, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్ రవి ప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వర్ రావ్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎంపిపి

30న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు

- జయప్రదం చేయండి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రధానమంత్రి మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలని ఈ నెల 30న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సును రాజకీయాల కతీతంగా జిల్లాలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. శుక్రవారం ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల్లోని పలు గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్ర హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, ఎలక్ట్రిసిటీ బిల్-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధ కనీస మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. దేశవ్యాప్తంగా 500 పైగా రైతు సంఘాలతో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీలో 387 రోజులపాటు ఆందోళన నిర్వహించిన ఫలితంగా దేశ ప్రధాని మోడీ దిగివచ్చి డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరిస్తానని లిఖితపూర్వకమైన హామీ ఇచ్చి నేటికీ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మళ్లీ దేశవ్యాప్తంగా ఢిల్లీ తరహా ఉద్యమాన్ని ప్రారంభించేందుకు పోరాట రూపాల ప్రణాళిక రూపొందించడానికి రాష్ట్రంలోని అన్ని రైతు, కార్మిక సంఘాలతో కలిసి రాష్ట్రస్థాయిలో కర్షక కార్మిక రాష్ట్ర సదస్సును ఈ నెల 30న విజయవాడలో నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఢిల్లీ ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మణిపూర్ రాష్ట్రంలో మారణకాండను ఆపాలని, అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలానికి కొనసాగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,20,390 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 4311, హంద్రీ నుండి 117 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతుంది. అదే సమయానికి జలాశయం నీటి మట్టం 825.90 అడుగులుగా, నీటి నిలువ సామర్థ్యం 45.5370 టిఎంసిలుగా నమోదయింది. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు.

దళారుల చేతిలో మోసపోవద్దు

- మిర్చి రైతులకు మార్కెట్ యర్డ్ సెక్రటరీ కల్పన సూచన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మార్కెట్ యార్డ్ పరిధిలోని మిర్చి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఏసి గోదాముల వద్దకు తీసుకెళ్లి దళారుల చేతుల్లో మోసపోవద్దని, మిర్చి యార్డులోనే అమ్ముకోవాలని నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ కల్పన సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. కోల్డ్ స్టోరేజ్‌లకు నేరుగా సరుకు తీసుకెళ్లి అమ్ముకొని మధ్య దళారుల చేతుల్లో మోస పోవద్దని రైతులను హెచ్చ రించారు. గతంలో మిర్చి రైతులు ఇక్కడి నుండి గుంటూరు మార్కెట్ యార్డ్‌కు వెళ్ళేవారని, తత్ఫలితంగా రవాణా, ఇతర ఖర్చులు అదనంగా వచ్చేవన్నారు. వాటిని నివారించి నంద్యాలలోనే టెక్క మార్కెట్ యార్డులో మిర్చి యార్డ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్‌లో రైతులకు లాభాదాయకంగా ఉండేలా లైసెన్స్ ట్రేడర్స్‌తో విక్రయాలు జరిపించామన్నారు. గుంటూరు మార్కెట్‌లో ఏ రేటు ఉంటే అది లోకల్‌గా ఉండేలా చూస్తున్నామన్నారు. ఇటీవల మిర్చి మార్కెట్‌కు రాకుండా కొంతమంది దళారులు కోల్డ్ స్టోరేజ్‌లకు రైతులను రప్పించుకొని అక్కడే విక్రయాలు మొదలు పెట్టారన్నారు. మిర్చి మార్కెట్ యార్డ్ అభివృద్ధి చెందాలంటే రైతుల చేతుల్లోనే ఉందన్నారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యాలు కూడా గోడౌన్‌లలో మిర్చి వేలాలను నిర్వహించకూడదని, తక్షణమే బంద్ చేసి యార్డ్‌లో ట్రేడింగ్ చేయాలని తెలిపారు. రైతులు మిర్చి యార్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ కల్పన

పులుల సంరక్షణ అందరి బాధ్యత

- చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య

ప్రజాశక్తి - మహానంది

పులుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని 1వ సచివాలయంలో అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, గాజులపల్లె పిహెచ్సి డాక్టర్ వెంకటరెడ్డి, ఎంపిటిసి చౌటిపల్లె నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పులుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ జీవ సమతుల్యతపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వెంకటరెడ్డి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం :** అడవులను సంరక్షించుకుని పులులను కాపాడుకుందామని ఆలమూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి మక్తర్ భాష తెలిపారు. నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లమల సమీపంలోని ఆలమూరు సెక్షన్ పరిధిలోని బాచేపల్లి, ఆర్.కృష్ణాపురం గ్రామాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ ప్రాముఖ్యత, అటవీ ఆవరణ వ్యవస్థ సమతుల్యతలో పెద్ద పులి ప్రధాన పాత్ర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బీట్ ఆఫీసర్లు జేమ్స్‌పాల్, హుస్సేన్ బాషా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహానంది : మాట్లాడుతున్న చలమ రేంజ్ ఆఫీసర్

నల్లమలలో జలపాతాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

నల్లమల అడవుల్లో పచ్చని చెట్లు, పక్షుల రాగాలతో పాటు జలపాతాలు పర్యాటకులను, ప్రజలను కనువిందు చేస్తున్నాయి. కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామ శివారులో వెలసిన పురాతన కొలనుభారతి క్షేత్రం వద్ద జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. వర్షాకాలంలో కొలనుభారతి దర్శనం అనంతరం అడవుల్లోకి వెళ్లి వాటర్ ఫాల్స్‌ను తిలకించి ఆనందంగా గడుపుతున్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యూ విజేత ఏజెన్సీలో రూ.49,725, భారత్ పెస్ట్ కం ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.84,560 బయో స్టిములెంట్స్ పురుగు మందులు సరైన అనుమతులు లేని కారణంగా అమ్మకాలు నిలిపి వేశారు. యాజమానులు వ్యవసాయ శాఖ నుండి అనుమతులు వున్న ఎరువులు, పురుగు మందులు మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డ్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు రసీదులు కచ్చితంగా ఇవ్వాలని హెచ్చరించారు.

పురుగుల మందులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

రాష్ట్రంలో పేదలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు మండల కేంద్రంలో సర్పంచ్ ఎరుకలి సంధ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రం వెళ్లిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నేరేడు చిన్న సంజీవరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ముడిమేల పుల్లారెడ్డి, ఏపీ సిడిపిఎల్ డైరెక్టర్ డాక్టర్ శశి కళా రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రాజం రెడ్డి, సుజాతమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ముంతల మధురాని, రాగాల వెంకటరమణ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ చిన్న నారాయణరెడ్డి, ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ రవికుమార్, ప్రజలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : సిఎం జగన్ వల్లే సంక్షేమ పథకాలు సాధ్యమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మండలంలోని నందిపాడు, పెట్నికోట గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మొలక రాజారెడ్డి, వైసిపి నంద్యాల ప్రవాస జిల్లా అధ్యక్షులు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ గురువిరెడ్డి, ఎంపిడిఓ ప్రసాద్ రెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, అర్ధబ్ల్యూఎస్ సుబ్రహ్మణ్యం, వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ప్రజలకు భరోసా లాంటిదని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నంద్యాల సుబ్బమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 రకాల 209 ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేశారు. నారాయణరెడ్డి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి:** మండలంలోని ముత్యాలపాడు, తోడేళ్లపల్లె గ్రామాల సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు శంకరమ్మ భాయ్, గోవిందయ్య, ఎంపిటిసి వరికూటి వెంకట రాముడు, శేషు రమేష్‌ల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ సుభద్రమ్మచ ఎంపీడీవో మొహబబ్ దౌల, మండల విస్తరణ అధికారి ఎస్ఎస్ఎస్ సుదర్శన్ రావులు పాల్గొని ధ్రువీకరణ పత్రాలు, కౌలు కార్డులను అందజేశారు. అనంతరం సీనియర్ నాయకుడు గోవిందయ్య, శేషు రమేష్, ఎంపిటిసి వరికూటి వెంకట రాముడు మాట్లాడారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మోడీ పాలన నుండి

రైతు, శ్రామికులను కాపాడాలి

ప్రజాశక్తి - మిడుతూరు

మోడీ పాలన నుండి రైతులను, శ్రామికులను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి ఓబులేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం గోడ పత్రిక ను స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను, ఎలక్ట్రికల్ బిల్లు 2020 రద్దు చేయాలని, పంటలన్నింటికీ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసే విధంగా సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి సి ప్లస్ టు 50 శాతం చట్టబద్ధత ఎంఎస్పి నిర్ణయించబడాలని, రైతులకు ఒక పర్యాయం పంట రుణాలు మాఫీ చేయాలని అన్నారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాలని కేరళ తరహా రైతు ఉపశమన చట్టం పార్లమెంటులో ఆమోదించి రైతుల కౌలు రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని కోరారు. నందికొట్కూరు నియోజకవర్గంలో అన్ని ఎత్తిపోతల పథకాలకు రైతులకు నీరు అందే విధంగా నిధులు కేటాయించాలన్నారు. అదేవిధంగా మిడుతూరు మండలంలో హంద్రీనీవా, సుజల స్రవంతి ద్వారా ఎత్తిపోతల పథకం మంజూరు చేసి మెట్ట రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈనెల 30వ తేదీన విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే కిసాన్ మోర్చా కార్మిక కర్షక సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మానికింది హరి నాయుడు, కార్యదర్శి ఎం శేఖర్, రైతు నాయకులు కె శివ రాముడు, జయ రాముడు, మద్దిలేటి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు టౌన్ : రైతులకు కనీసం మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి, విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు, రైతులకు రుణమాఫీ, తదితర సమస్యల పరిష్కారానికై ఈనెల 30వ తేదీన విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరుగు కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు టి గోపాలకృష్ణ కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను పట్టణంలోని పలు ప్రాంతాలలో అతికించారు. ఈ కార్యక్రమంలో వడ్డే రాజు సాజిద్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న 14 నెలల వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి ఊరి చివర వేసి గ్రామాల పరిశుభ్రతకు ప్రజలకు అంటు రోగాలు రాకుండా చూస్తూ నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకపక్క రోజురోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ ఉంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ స్వచ్ఛభారత్ కార్మికులు నిత్యం పనిచేస్తున్నార న్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సర్పంచుల చుట్టూ.. జిల్లా అధికారుల చుట్టూ.. తిరిగిన ఏమాత్రం ఫలితం లేదని, పనులు చాలించుకోండి వేరేవాళ్లను పెట్టుకుంటామని బెదిరింపులు చేస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు సంవత్స రాల క్రితం రూ.10వేలు జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 వచ్చినా నేటికీ అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేతనాలు సక్రమంగా చెల్లిస్తామని ఒక ప్రక్క ప్రచారం చేసుకుంటున్న వాస్తవానికి చిన్న ఉద్యోగస్తులకు నెలలు తరబడి వేతనాలు అందకపోవడంతో మానసికంగా కృంగిపోతున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేలా జిల్లా కలెక్టర్, డిపిఒ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటి యు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, వ్యకాసం జిల్లా నాయకులు స్వాములు, స్వచ్ఛ భారత్ కార్మికులు స్వామి దాసు, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, సుధాకర్, రవితేజ, రామకృష్ణ, లింగన్న, పరుశురాముడు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

బిజెపిపై అవిశ్వాస తీర్మానానికి వైసిపి, టిడిపిలు మద్దతు ప్రకటించాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఎన్‌డిఎ అవిశ్వాస తీర్మానానికి వైసిపి, టిడిపిలు మద్దతు ప్రకటించాలి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు సిపిఎం కార్యా లయంలో సిపిఎం నాయకులు పి వెంకటే శ్వర్లు, పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, నాగన్నలతో కలిసి ఆయన మాట్లాడారు. మణిపూర్ సంఘటనపై పార్లమెంటులో ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టగా రాష్ట్రంలోని వైసీపీ, టిడిపి ఎంపీలు మద్దతు తెలుపకపోవడం విచారకరమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలియజేయడం విచారకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ చేస్తున్నామని ప్రకటించిన, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం అమలు చేయలేమని బిజెపి ప్రభుత్వం కళాఖండిగా చెప్పిన, రాయలసీమకు సాగునీరు రాకుండా ఉండేందుకు కర్ణాటక సరిహద్దుల్లో అపర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి రాయలసీమ ప్రజలకు ఇరువురు ద్రోహం చేస్తున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి మద్దతు తెలియజేయడం దారుణం అన్నారు. మణి పూర్ సంఘటనను ఇంతవరకు అధికార ప్రతిపక్ష పార్టీలు ఖండించకపోవడం విచారకర మన్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలియజేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని వారు కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

దళితులకు భూములు చూపని అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మిడుతూరులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. నాగేశ్వరావు, సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీరు సాహెబ్, టీగోపాలకృష్ణ, టి ఓబులేష్ కలిసి దళితులకు వెంటనే భూములు చూపాలని తాసిల్దార్ ప్రకాష్ బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన ఎస్సి మాదిగ, మాల, బీసీ కులాలకు చెందిన పేదలకు 1996 సంవత్సరంలో అలగనూరు పొలిమేరకు సంబంధి ంచిన భూములను ఇవ్వడం జరిగిందని, అందుకు సంబంధించిన పట్టాలు, పాసు బుక్కులూ ఇచ్చారు.. కానీ ఇంతవరకు భూములు చూపలేదని అన్నారు. భూములు చూపాలని అనేక రూపాల్లో ఆందోళన చేసినప్పటికీ అధికారులు పట్టించు కోవడంలేదని వారు పేర్కొన్నారు. శాసనసభ్యులు తొగురు ఆర్థర్, జిల్లా కలెక్టర్, ఆర్డిఓల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు వివిధ సాకులు చెబుతూ కాలయాపన చేస్తూ దళితులపై వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భూములు చూపించాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయ కులు రామకృష్ణ, సీతారాం, గ్రామస్తులు సుజ్ఞానం, మదిలేటి, జయరాముడు ,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : జెఎసి

ప్రజాశక్తి - బేతంచర్ల

విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంటాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు బేతంచెర్లలోని డోన్ రోడ్డులో గల విద్యుత్ సబ్స్టేషన్ వద్ద జేఏసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా సమాజానికి వెలుగునిచ్చే పనిలో నిమగ్నమై ప్రాణాల సైతం లెక్కపెట్టకుండా విధులు నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి విధి నిర్వహణలో తీవ్రంగా గాయ పడిన లేదా మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు కోరారు. ఆగస్టు 8వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు, పర్మినెంట్ ఉద్యోగులు సురేష్ బాబు, నిరంజన్ బాబు, శ్రీనివాసులు ,చంద్రశేఖర్, మస్తాన్, కాంటాక్ట్ కార్మికులు గిరి కుమార్ , ఆంజనేయులు, ఎనర్జీ అసిస్టెంట్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎసి నాయకులు

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక చిన్న మకానం కాలనీలోజరుగుతున్న మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఆయన ఇక్కడికి చేరుకోగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, లాల్ స్వామి కమిటీ, నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే లాల్ స్వామికి ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు. లాల్ స్వామి కమిటీ ఉపాధ్యక్షుడు చక్రం ముల్లా షబ్బీర్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి మండల ఉపాధ్యక్షుడు అయినా ముల్లా రఫీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం పాత బస్టాండ్‌లో వెలసిన హుస్సేన్ బాష స్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రాతెహాలు నిర్వహించారు. ఇక్కడ స్వామి కమిటీ అధ్యక్షుడు చాంద్ భాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం స్థానిక చక్రం ముల్లా షబ్బీర్ కార్యాలయంలో శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. పార్టీలకు, వర్గాలకు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని అన్నారు. ఎంపీటీసీ ఫయాజ్ లక్ష్మిరెడ్డి, పత్తి నారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబీర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, పెద్ద వంగలి సర్పంచ్ బంగారు షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

లాల్ స్వామికి ప్రత్యేక ఫాతిహాలు చేస్తున్న ఎమ్మెల్యే

ఖాద్రీ అసోసియేట్స్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని భరత్ కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఖాద్రి అసోసియేట్స్ కార్యాలయంను నిర్వాహకులు సద్దాం హుస్సేన్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీపీవో బాల మద్దయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాద్రీ అసోసియేట్స్ సీఈవో సద్దాం మాట్లాడుతూ అసోసియేట్స్ ముఖ్య ఉద్దేశం గృహ నిర్మాణాలకు సంబంధించిన మున్సిపల్ అప్రూవల్స్, ఎస్టిమేట్స్, ఇంటీరియర్ వర్క్స్,ప్లానింగ్ అప్రూవల్ తదితర సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యకమంలో కర్నూల్ ఏఎస్పై ఖాదర్ బాషా, మహబూబ్ బాషా,జిలాన్ బాషా,షఫీవుల్లా,లాయర్ జాకీర్,మహబూబ్,నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పట్ల జాగ్రత్తలు పాటించాలి : ఎడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతంలో ఉన్న మొక్కజొన్న పంటలు సాగుచేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూర్ ఏడి ఆంజనేయ తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ అధికారుల సలహాలు రైతులు పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రతి మొక్కజొన్న పంటలు అధిక వర్షాల వలన ఎర్రగా మారే అవకాశం ఉందన్నారు. వర్షం తగ్గిన వెంటనే పొలంలో నీరు నిలవ ఉండకుండా కాలువల ద్వారా నీరు బయటకు పంపి వేసేలా రైతులు చూసుకోవాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

పార్కులో అన్ని సౌకర్యాలు : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇంటి ఎదురుగా ఉన్న నెహ్రూనగర్ పార్కులో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల.రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణం లోని నెహ్రూనగర్ పార్కు దగ్గర 25 లక్షల రూపాయలతో కేఫ్టేరియా, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి చైర్మన్ సప్తశైల.రాజేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలోని ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేందుకు పార్కులో క్యాంటీన్, టాయిలెట్స్ ఏర్పాటు చేసి సేద తీరడానికి వచ్చే ప్రజలకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ మిట్టాఉమామహేశ్వరి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడు,మినిస్టర్ పిఏ ఉమామహేశ్వర్ రెడ్డి,కాంట్రాక్టర్ లు కాలేషా,మిట్టారవి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల.రాజేష్

శ్రీశైలంలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణ మాసంలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహధికారి లవన్న తెలిపారు. శుక్రవారం ఇఒ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన అధిక శ్రావణ మాసం ప్రారంభమైందని, ఆగస్టు 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిజ శ్రావణ మాసం ఉంటుందని, ఈ మాసంలో ఉత్సవాలు నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. ఈ మాసంలో భక్తుల రద్దీ దృష్ట్య గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకాలను నిలుపుదల చేయడం జరిగిందని ఇఒ తెలిపారు. స్పర్శ దర్శనం టికెట్లను దేవస్థానం వెబ్సైటు www.srisailadev-asthonom.org ద్వారా పొందాలని పేర్కొన్నారు. ఆగస్టు మాసం టికెట్లను ఇప్పటికే ఆన్లైన్లో ఉంచడం జరిగిందని, సెప్టెంబర్ మాసం టికెట్లను ఆగస్టు 25వ తేదీ నుండి ఆన్లైన్లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. దర్శనం టికెట్లను సమయానకులను బట్టి ఒక గంట ముందు వరకు ఆన్లైన్లో ఉంచడం జరుగుతు ందన్నారు. ఆన్లైన్ ద్వారా పొందిన టికెట్లను, జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్‌ను భక్తులు వెంట తీసుకురావాలని ఇఒ సూచించారు. నిర్దిష్ట రోజుల్లో కాకుండా మామూలు రోజులలో మంగళ, బుధ, గురు, శుక్ర వారాలలో మధ్యాహ్నము రెండు గంటలకు స్పర్శ దర్శనం యధావిధిగా ఉంటుందని అన్నారు. అలంకార దర్శనం కోసం శీఘ్ర దర్శనం రూ.150 టికెట్లను, రూ.300 టికెట్లను 30 శాతం టికెట్లను ఆన్‌లైన్‌లో పొందవచ్చునని, మిగిలిన 70 శాతం టికెట్లను కరెంటు బుకింగ్ పొందే అవకాశం కల్పించడం జరిగిందని ఇఒ తెలిపారు.

మిషన్ రాయలసీమతో అభివృద్ధి : తెలుగు యువత

ప్రజాశక్తి - పాములపాడు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా రాయలసీమ సమస్యలను అధ్యయనం చేసి మిషన్ రాయలసీమతో ఓ ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు తీసుకున్న నిర్ణయం వలన రాయలసీమ అభివృద్ధి చెందుతు ందని తెలుగు యువత మండల అధ్యక్షులు మధు కృష్ణ అన్నారు. శుక్రవారం పాములపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో మిషన్ రాయలసీమ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు టిడిపి అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో తెలుగు యువత నాయకులు కలిముల లింగేష్ గౌడ్, మనోహర్, మధు, వీరేష్, రహీం షహీన్, శీను, బాబావలి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగు యువత

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

కాలుష్యం నివారించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో వెంగన్న, ఏపీవో శేషన్న ఆధ్వర్యంలో హెచ్చు కొట్టాల గ్రామంలో ముచ్చట్ల మల్లికార్జున స్వామి టెంపుల్ రోడ్డుకు, కొలుముల పల్లి గ్రామం నుండి బుగ్గానపల్లి రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో 20 కిలోమీటర్ల వరకు 8000 మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత అంచనా వేయడం జరిగిందని, అందులో భాగంగానే మొదటి రోజు హెచ్ కొట్టాలా, బలపాలపల్లి, కొలుములపల్లి, బుగ్గానీపల్లి గ్రామాలకు వేసిన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, సర్పంచులు వెంకట లక్ష్మమ్మ, చిన్న మద్దమ్మ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు వేల్పుల సైన్యం చేయూత

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలో పెద్ద గుమ్మడాపురం గ్రామంలో జరుగుతున్న మొహర్రం పండగకు లైటింగ్ డెకరేషన్ కోసం నిర్వాహకులు రహంతులకు రూ. 5116 లను కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ కుమార్ ఆర్థిక సహాయంను శుక్రవారం అందజేశారని ఫార్మసిస్ట్ నాగన్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడైనా పేద ప్రజలకు ఆర్థిక చేయూత చేసేందుకు వేల్పుల సైన్యం ముందుంటుందన్నారు. అనంతరం మొ హర్రం పండగకు సహాయం అందించేందుకు ముఖ్యపాత్ర పోషించిన పలువురిని నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచ్చిరెడ్డి సురేంద్ర, అహమ్మద్ బడే బచ్చా, రమణ, చంద్ర, శీను, వెంకటేశ్వర్లు, నాగన్న, హుస్సేన్, చిట్టెన్న, పకీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాని పరామార్శిస్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, చిత్రంలో టిడిపి నాయకులు

కార్యకర్త కుటుంబానికి చంద్రబాబు ఆర్థికసాయం

ప్రజాశక్తి - బేతంచర్ల

ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రూ.2లక్షల ఆర్థిక సాయం అందజేశారు. బేతంచర్ల మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన వేల్పుల నాగార్జున గత నెల 28న కరెంట్ షాక్‌తో మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మన్న బాధిత కుటుంబ పరిస్థితిని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చంద్రబాబు నాయుడు కుటుంబాన్ని పరామర్శించి, మరణించిన వ్యక్తికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడం వల్ల ఆ కుటుంబానికి రెండు లక్షల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు.

అవుకులో స్వల్ప ఉద్రిక్తత

- చల్లా శ్రీలక్ష్మీ అనుచరులు, బలిజలు ఘర్షణ

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో శుక్రవారం సాయంత్రం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. జడ్పిటిసి చల్లా శ్రీ లక్ష్మీ అనుచరులు, బలిజ సంఘం కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన కొందరికి గాయాలయ్యాయి. ఒకవైపు మొహరం వేడుకలు పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతుండగా మరొకవైపు ఈ ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో పట్టణంలో కొద్దిసేపు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సకాలంలో అవుకు ఎస్సై నరేంద్ర ఘర్షణ జరిగిన ప్రదేశానికి చేరుకొని ఇరుగ్రూపుల వారిని పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

నివేదికలకే 'సర్వసభ్య' పరిమితం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఎంపీపీ నల్లకాలువ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం నివేదికలకే పరిమితం అయ్యింది. ఈ సమావేశానికి హాజరు కావలసిన ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కాకపోవడంతో కోరం కోసం దాదాపు అరగంట పాటుగా అధికారులు ఎదురు చూశారు. ఎటికేలకు సమావేశానికి నలుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరు కావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. ఇదే సందర్భంలో గ్రామ సర్పంచులు సమావేశానికి హాజరు కాకుండా సమావేశం బయట ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని తమ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఏమాత్రం సరిపోవటం లేదని వీటి రీత్యా స్వచ్ఛభారత్ కార్మికులకు తమ వేతనాలు చెల్లించలేమని చర్చించుకుని ఓ తీర్మానాన్ని తయారు చేసుకుని వచ్చి మండల సమావేశంలో ప్రవేశపెట్టడంతో పాటు ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఏకగ్రీవ తీర్మానాన్ని చేయించారు. వివిధ మండల స్థాయి అధికారులు తమ శాఖ పరిధిలో చేపడు తున్న సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులకు వివరించడం తోటే సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి ఎంపీడీవో మోహన్ కుమార్, తహశీల్దార్ ఉమాదేవి, జడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వలేం : సర్పంచులు

గ్రామాలలో స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి 15వ ఆర్థిక నిధులనుండి వేతనాలు చెల్లించలేమని గ్రామ సర్పంచులు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని గ్రామ సర్పంచులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులకు వినతిపత్రం అందించి, మండల సర్వసభ్య సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపారు.

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచులు

ఉచితంగా చెవి ఆపరేషన్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని సంజీవ్ నగర్ గేటు దగ్గర ఉన్న తిరుమల పునీత్ ఈఎన్‌టి హాస్పిటల్‌లో యల్లా వత్తుల గ్రామానికి చెందిన తులసమ్మకు రోటరీ క్లబ్ తరపున ఉచితంగా చెవి ఆపరేషన్ శుక్రవారం డాక్టర్ అనిల్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌ను రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు దండే దస్తగిరి అభినందించారు. కార్య క్రమంలో ఉపాధ్యక్షులు ఎన్‌సి.మోహన్ రెడ్డి, సెక్రటరీ సుధా ప్రసాద్ రెడ్డి, కోశాధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో పల్లకీ సేవ మహెూత్సవం శుక్రవారం ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిం చారు. దేవస్థానంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్ల కిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఉద్యోగులు సమయపాలన పాటించాలి'

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు సమయ పాలన పాటించకుంటే కఠినమైన చర్యలు ఉంటాయని ఎంపీడీవో గోపికృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఈవోఆర్‌డి శ్రీనివాస్ నాయుడు వర్షాకాలం సీజన్‌లో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, తదితర సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగస్తులు ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. మూమెంట్ రిజిస్టర్‌ను నిర్వహించాలని, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, తదితరులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ